సాక్షి
మెదక్
మంగళవారం । 9 । జనవరి । 2024



వేర్వేరు చోట్ల దొంగల హల్‌చల్

వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం దొంగలు హల్‌చల్ చేశారు. రాయాయంపేట, కొమురవెల్లిలో చోరీలు జరిగాయి. వివరాలు 8లో ▸



చిందు చిన్నబోయింది

దాసరి బాగోతం నాటి తరానికి ఆహ్లాదంతోపాటు చారిత్రక ఘట్టాలను కళ్లముందుంచింది. వివరాలు 8లో ▸



నర్సాపూర్ అభివృద్ధికి కృషి

నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఇన్‌చార్జి చైర్మన్ నయీమొద్దీన్ అన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సీఎంఆర్‌కు గడువు పొడిగించబోం

కలెక్టర్‌కు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టీకరణ



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: రైస్ మిల్లర్లు తమ వద్ద ధాన్యాన్ని ఈ నెలాఖరు లోపు మిల్లింగ్ చేసి బియ్యం అందించాలని, ఇక పొడిగించే అవకాశం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ అంబేడ్కర్ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ప్రధాన కార్యదర్శి, కమిషనర్ డీఎస్ చౌహాన్‌లతో కలిసి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి... కలెక్టర్, పౌరసరఫరాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ, వానా కాలం, యాసంగి సీఎంఆర్ (కస్టమ్స్ మిల్లింగ్ రైజ్) పూర్తి చేసే అంశాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్‌లు రమేష్, వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన డైలీ టార్గెట్ ప్రస్తుతం 79 శాతం పూర్తయ్యే దిశగా ఉందన్నారు. 100 శాతానికి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఎలాంటి జాప్యం లేకుండా సీఎంఆర్ టార్గెట్ పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

డేటా ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలి



చిలప్‌చెడ్‌లో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ కార్యక్రమం నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలని నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని తహసిల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో కొనసాగుతున్న ఈ కార్యక్రమాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎలాంటి తప్పులు జరగకుండా అధికారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ తంతు ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రమే జరగాలని, ప్రైవేట్ కేంద్రాల్లో నమోదు చేయరాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముసాద్దిక్, డిప్యూటీ తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ శశిప్రభ, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

'పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

నర్సాపూర్: ప్రభుత్వ పథకాలను గ్రామీణులు సద్వినియోగం చేసుకునేలా చైతన్యం తేవాలని జిల్లా నాన్‌ఫాం ప్రాజెక్టు మేనేజర్ మోహన్ సూచించారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో నర్సాపూర్, శివ్వంపేట, చిలప్‌చెడ్ మండలాల ఐకేపీ ఏపీఎంలు, సీఏలు, సీసీలకు గ్రామీణ పేదరిక తగ్గింపు ప్రణాళిక, పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆయా రంగాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు గౌరీ శంకర్, వెంకటేశ్వర్లు, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

'సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు'

చేగుంట(తూప్రాన్): గ్రామ స్థాయి మహిళ సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా యాంకర్ పర్సన్ వెంకటస్వామి తెలిపారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో వీఓఏలు, సీసీలు తదితరలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళ సంఘాల డేటా కంప్యూటరైజ్డ్ చేయాల్సిన పద్ధతుల గురించి తెలిపారు. సభ్యురాలికి రేషన్, ఆధార్, ఉపాధి హామీ జాబ్ కార్డు వంటి వివరాలను సేకరించాలని తెలిపారు.

కొత్తపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

పాపన్నపేట(మెదక్): కొత్తపల్లి సర్పంచ్ కుమ్మరి జగన్నాథం చెక్ పవర్ రద్దు చేస్తూ కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు. తన సంతకం లేకుండా నిధులు డ్రా చేశారని, గ్రామసభలు సైతం సవ్యంగా నిర్వహించలేదని ఉపసర్పంచ్ అంజలి ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎల్‌పీఓ విచారణ చేపట్టి నివేదిక సమర్పించగా పై నిర్ణయాన్ని కలెక్టర్ తీసుకున్నారు. కాగా ఎంపీఓ, ఉపసర్పంచ్ సంతకాలతో నిధులు డ్రా చేయవచ్చని ఉత్తర్వుల్లో సూచించారు.

చలి వణికిస్తున్నా.. చీపురు ఆగదన్నా..

రక్షణ పరికరాలు లేక పారిశుద్ధ్య కార్మికుల పాట్లు





సాక్షి విజిట్

నర్సాపూర్‌లో రోడ్లు ఊడుస్తున్న కార్మికులు

వారికి ఎండా, వాన, చలి, పండుగ పబ్బం అనే తేడా ఉండదు. అప్పగించిన బాధ్యతలను ఓ యజ్ఞంలా చేయడమే వారికి తెలిసిన విద్య. పల్లెలు, పట్టణాలు పరిశుభ్రతలో మెరిపించడమే వారి నిరంతర తపన.. రక్షణ పరికరాలు, సరైన దుస్తుల్లేకపోయినా ఎముకలు కొరికే చలిలోనూ పనిచేస్తుంటారు. దాని వెనుక పారిశుద్ధ్యం కార్మికులు పడే కష్టం.. శ్రమ వర్ణనాతీతం. ప్రస్తుతం అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా.. తెల్లవారుజామున 5.30 గంటలకే వారికి కేటాయించిన ప్రాంతాల్లో పనిలోకి దిగుతున్నారు. సోమవారం తెల్లవారుజామున 'సాక్షి' విజిట్ చేయగా వారు పడుతున్న బాధలు, పలు అంశాలు వెలుగుచూశాయి.

మెదక్: జిల్లాను చలి వణికిస్తోంది. రాష్ట్రం మొత్తం మీద చూసుకుంటే అత్యధికంగా దాని ప్రభావం మెతుకుసీమలోనే ఉంది. వారం రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు 12కు పడిపోతున్నాయి. ఇలాంటి సమయంలో బయటకు వెళితే అనారోగ్యం బారిన పడతారని వైద్యులు చెబుతున్నారు. ఇవేమీ పట్టని పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో భాగంగా తమ దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమవుతున్నారు. మున్సిపల్ కార్యాలయాల వద్దకు తెల్లవారుజాము 5 గంటలకల్లా చేరుకుంటున్నారు. 5.30 గంటల లోపు కేటాయించిన ప్రాంతాల్లోకెళ్లి చల్లగాలులను సైతం లెక్కచేయక విధులను శుభ్రం చేస్తున్నారు. కానీ ఏటా రక్షణ పరికరాలు అందడం లేదు.

మెదక్ జిల్లాలోని రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్, మెదక్ మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటిల్లో 357 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏటా రక్షణ దుస్తులు అందించాల్సి ఉంటోంది. శీతాకాలంలో తెల్లవారుజాము పనిచేసే వారికి చలి కోట్లు, వానాకాలంలో రెయిన్ కోట్లు, వేసవిలో క్యాప్‌లు ఇవ్వాల్సి ఉంది. వాటితోపాటు గ్లౌజులు, మాస్కులు, బూట్లు, ఏడాదికోసారి విధిగా ఇస్తుండాలి. అంతేకాకుండా ప్రతి మూడు మాసాలకోసారీ సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు, శానిటైజర్లు సరేసరి. కాగా గత రెండు, మూడేళ్లుగా అందటం లేదని పలువురు కార్మికులు వాపోయారు. కొన్నేళ్లుగా అసలు కొనుగోలు చేయడం లేదని సమాచారం. నెలకు 2 లేక 3 చీపుర్లు, కొడవళ్లు, డబ్బాలు, గడ్డపారలు, కాలువ తీసే పారలు, గొడ్డళ్లు తదితర వస్తువులు ఇవ్వాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. అయితే రామాయంపేట మున్సిపాలిటీ పరిధి లో పనిచేసే తమకు ఏడాది నుంచి ఎలాంటి రక్షణ పరికరాలు ఇవ్వటం లేదని పారిశుద్ధ్య కార్మికులు చెబుతున్నారు. కనీసం చేతులకు బ్లౌజ్‌లు సైతం లేకుండానే ఇళ్ల నుంచి చెత్త సేకరణ చేస్తున్నారు.

రక్షణ పరికరాలు ఇవ్వలేదు



కొంతకాలంగా రక్షణ పరికరాలు ఇవ్వటం లేదు. గ్లౌజులు, నూనెలు ఇవ్వటం లేదు. ఇటీవల చెప్పుల కోసం దరఖాస్తు పెట్టాం. ఎప్పుడు మంజూరవుతాయో తెలియని పరిస్థితి.

– బాలమణి, పారిశుద్ధ్య కార్మికురాలు, మెదక్



నాగ్సాన్‌పల్లి అడవిలో కందకం పూడ్చి వేసిన స్థలం చూపుతున్న గ్రామస్తులు

20 ఎకరాల అటవీ భూమి కబ్జా?

- పౌల్ట్రీఫాం యజమానులపై నాగ్సాన్‌పల్లి గ్రామస్తుల ఫిర్యాదు
- చెట్లు నరికి వేసినందుకు.. వాల్టా, ఫారెస్ట్ యాక్ట్ కింద కేసు
- జాయింట్ సర్వే చేసి చర్యలు : డీఎఫ్‌ఓ రవిప్రసాద్



కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్ఓ

కౌడిపల్లి(నర్సాపూర్): అటవీ భూమిలో ఉన్న వేలాది చెట్లు నరికి వేసి.. 20 నుంచి 30 ఎకరాలను ఫౌల్ట్రీఫాం యజమానులు ఆక్రమించారని సర్పంచ్ ఎల్లం, ఉసర్పంచ్ నరహరి, వార్డు సభ్యులు భిక్షపతి, శ్రీను, గ్రామస్తులు రాములు శ్రీనివాస్, సుధాకర్, లక్ష్మయ్య, సురేష్, రాజలింగం, వీరేష్ తెలిపారు. సోమవారం ఈ విషయమై డీఎఫ్‌ఓ రవిప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 765డి జాతీయ రహదారికి పక్కన నాగ్సాన్‌పల్లిలో గతంలో బేసిక్ బ్రీడర్స్ పౌల్ట్రీ ఫాం సర్వేనంబర్ 93లో 311.14 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం మూడు భాగాలు పంపకాలు జరిగాయి. అందులో ఒక భాగస్తురాలైన లక్ష్మీబంజార లచ్చిరాంనాయక్, ఆమె బంధువులు.. పక్కనే ఉన్న అటవీ భూమి కబ్జాకు పాల్పడిన్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. అటవీ రక్షణ కోసం తీసిన కందకాలను పూడ్చి వేసి చెట్లు నరికి 20 నుంచి 30 ఎకరాలను ఆక్రమించి కొత్తగా రాళ్లు వేశారన్నారు. ఇదంతా నర్సాపూర్ ఎఫ్ఆర్‌ఓ అంబర్‌సింగ్ ప్రోత్సాహంతోనే జరుగుతోందని విమర్శించారు. ఈ విషయమై ఎఫ్ఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. ఆయన నుంచి సరైన స్పందన రాకపోవడంతో డీఎఫ్‌ఓ రవిప్రసాద్‌ను ఆశ్రయించారు. సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అడవిలో పౌల్ట్రీ ఫాం చుట్టూ సుమారు 3 కిలోమీటర్లు సిబ్బంది, గ్రామస్తులతో కలిసి ఆయన తిరిగారు. చెట్లు నరకడాన్ని గుర్తించారు. సర్పంచ్, ఉపసర్పంచ్ ఫిర్యాదు చేసినా గానీ పట్టించుకోలేదని, ఇంకా ఫౌల్ట్రీ యజమానులకు 20 ఎకరాల అటవీ భూమి వస్తుందని ఎఫ్ఆర్‌ఓ చెప్పడంపై గ్రామస్తులు మండిపడ్డారు. 93 సర్వేనంబర్‌లో గ్రామస్తులకు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన పట్టాలు ఉన్నాయన్నారు. అనంతరం డీఎఫ్‌ఓ మాట్లాడుతూ అనుమతి లేకుండా చెట్లు నరకడంపై వాల్టా, ఫారెస్ట్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఎఫ్ఆర్‌ఓపై, సెక్షన్ అధికారి కరీముల్లాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేనంబర్ 93లో ఉన్న అటవీ భూమిని మరోసారి జాయింట్ సర్వే చేయనున్నట్లు తెలిపారు. కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

మల్లన్నకు జలాభిషేకం



స్వామివారి మూలవిరాట్‌కు పూజలు నిర్వహిస్తున్న మాధవానంద సరస్వతీ స్వామి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కోనాపూర్ గ్రామశివారులో కొలువై ఉన్న మల్లన్న స్వామి కల్యాణోత్సవ వేడుకలు మూడు రోజులుగా వైభవంగా కొనసాతుండగా.. చివరి రోజైన సోమవారం అభిషేకాలను ఒగ్గు పూజారులు వైభవంగా నిర్వహించారు. స్థానిక మంజీరా నది నుంచి పుట్టమన్ను జలాలను తీసుకొచ్చారు. కాగా భక్తులు స్వామికి మొక్కులు చెల్లించారు. తొలుత మూలవిరాట్ విగ్రహానికి రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామిని బండ్లను ఊరేగించారు. కాంగ్రెస్ నాయకులు రవీందర్ రెడ్డి హాజరై స్వామికి పూజలు జరిపించారు.

పేదరిక నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న జాన్‌కెనడి

కౌడిపల్లి(నర్సాపూర్): పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని ఐకేపీ డీపీఎం జాన్‌కెనడి అన్నారు. సోమవారం కౌడిపల్లి ఐకేపీ కార్యాలయంలో కౌడిపల్లి, కొల్చారం, వెల్దుర్తి మండలాల సీసీలు, సీఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ డ్వాక్రా సంఘంలో ఉండేలా చూడాలన్నారు. అర్హులందరికీ బ్యాంక్, స్త్రీనిధి ద్వారా రుణాలు ఇవ్వాలన్నారు. దినసరి కూలీలకు రేషన్‌కార్డు, జాబ్‌కార్డు, పింఛన్ తదితర ప్రభుత్వ పథకాలు వారి దరి చేర్చాలన్నారు.

తప్పులు లేకుండా దరఖాస్తుల ఎంట్రీ

అధికారులకు అదనపు కలెక్టర్ రమేష్ సూచన



కొల్చారంలో దరఖాస్తుల ఎంట్రీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రమేష్

కొల్చారం(నర్సాపూర్): ప్రజాపాలన దరఖాస్తులను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని అదనపు కలెక్టర్ రమేష్ సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. నమోదులో ఏ సందేహం ఉన్న సంబంధిత అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీఓ గణేశ్ రెడ్డి, ఎంపీఓ లక్ష్మీ నారాయణ, ఏపీఓ మహిపాల్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రజాపాలన దరఖాస్తులు తప్పుల్లేకుండా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ రమేష్ హెచ్చరించారు. సోమవారం కౌడిపల్లి ఎంపీడీఓ, ఎంఆర్‌సీ కార్యాలయాలలో ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ప్రతి గ్రామపంచాయతీకి కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించుకోవాలన్నారు. రెండు రోజులుగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ అనుకున్న స్థాయిలో జరగడం లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీఓ కలీముల్లా, ఆర్ఐ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

చంపేస్తాం అంటున్నారు..

- 70 ఏళ్లుగా సాగు భూమి విషయమై అర్జీదారురాలు రూప ఫిర్యాదు
- ఇటీవల కొందరి నుంచి బెదిరింపులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: తనకు సర్వే నంబర్ 26/3/2లో భూమి ఉందని హవేళిఘనపూర్ మండలం గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రూప తెలిపారు. 70 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామన్నారు. ఇటీవల కొందరు వచ్చి తాము సాగు చేసుకుంటామని చెప్పి మాట వినకుంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా స్థాయి ప్రజావాణి నిర్వహించగా అందులో ఆమె ఫిర్యాదు చేశారు. అలాగే రేగోడ్ మండలం జగిర్యాల గ్రామానికి చెందిన కలాలి మల్లమ్మ కూడా.. తన ఇంటిలో ఉన్న బంగారాన్ని, ట్రాక్టర్‌ను ఇదే గ్రామానికే చెందిన వ్యక్తి ఎత్తుకెళ్తుంటే గ్రామస్తులు చూసి ఫోన్ ద్వారా సమాచారం తెలిపారన్నారు. ఈ విషయంలో న్యాయం చేయాలని కోరారు. స్పందించిన అదనపు ఎస్పీ, చట్టప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు.

పింఛన్ కోసమే అధిక అర్జీలు

ఉపాధి, భూ సమస్యలపై కూడా..

- ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్ రాజర్షిషా
- 87 దరఖాస్తుల రాక



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఇందులో వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణం స్పందించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం జరగగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ పద్మశ్రీతో కలిసి ఆయన అర్జీలను స్వీకరించారు. వాటిని పరిష్కరించి అర్జీదారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. 82 దరఖాస్తులు అందగా ఎక్కువ మంది పింఛన్లు, ఉద్యోగం, ఉపాధి, భూ సమస్యలను పరిష్కరించాలని సమర్పించారు. కార్యక్రమంలో డీపీఓ సాయిబాబా, మైనింగ్ అధికారి జయరాజ్, డీఎఫ్‌ఓ రవిప్రసాద్, డీఏఓ గోవింద్, డీఈఓ రాధాకిషన్, డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ, మెప్మా పీడీ ఇందిర, డీఐఈఓ సత్యనారాయణ, ఇతర శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

11 ఏళ్లుగా పింఛన్ రాలేదు



నా భర్త అనారోగ్యంతో చనిపోయి 11 ఏళ్లు అవుతుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పింఛన్ కోసం దరఖాస్తులు ఇస్తూనే ఉన్నా. ఇంకా మంజూరు కాలేదు. ఇప్పటికైనా కలెక్టర్ సారూ..ఈసారైనా నాకు మంజూరు చేయగలరు.

–సునీత, పెద్దశంకరంపేట

పీఎం అజయ్ మంజూరు చేయరూ..



నాకు పీఎం అజయ్ పథకం కింద పాడి పశువులు ఇప్పించండి. పలువురికి ఈ పథకం గురించి తెలియక లబ్ధిని పొంద లేకపోతున్నారు. అధికారులు దానిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

–అప్పాజిపల్లి సురేష్, నర్సాపూర్

ఎన్నో సార్లు అర్జీలు ఇచ్చాం



నా వయస్సు 15 ఏళ్లు. జన్యు లోపంతో ఎదగలేకపోయాను. పింఛన్ కోసం ఇప్పటికే ఎన్నో సార్లు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకు కూడా మంజూరు కాలేదు. ఇప్పటికైనా పింఛన్ ఇప్పించాలి.

–వికాస్, టేక్మాల్.



రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి మూడేళ్లు అవుతోంది. అప్పటి నుంచి పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నా. ఇప్పటికీ కూడా మంజూరు కాలేదు. ఎవరూ లేని అనాథను. ఇప్పటికైనా పింఛన్ ఇప్పించరూ..

– మన్న శ్రీనివాస్, ముద్రాజ్‌పల్లి, కౌడిపల్లి.



మా పాప పూజితకు 12 ఏళ్లు. రెండు కాళ్లు వంకర పోయాయి. కనీసం నిలబడలేదు. చేతులు కూడా పని చేయవు. పింఛన్ కోసం ఎన్నో సార్లు దరఖాస్తు చేశాం. ఇప్పటికీ మంజూరు కాలేదు.

– పూజిత, పెద్దశంకరంపేట

డీడీఓలదే టీడీఎస్ బాధ్యత



హాజరైన డీడీఓలు, అకౌంటెంట్లు



మాట్లాడుతున్న రాష్ట్ర అధికారి మానస్ నిరంజన్

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ ఉద్యోగుల టీడీఎస్ రిటర్న్స్ బాధ్యత డీడీఓలదేనని రాష్ట్ర ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయ అధికారి మానస్ నిరంజన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో టీడీఎస్ ఇన్‌కం ట్యాక్స్ పత్రాల ఆన్‌లైన్ నమోదుపై డీడీఓలు, అకౌంటెంట్లకు అవగాహన కల్పించారు. ఆ మేరకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మ్యానువల్‌గా రిటర్న్‌లో పొందుపర్చితే ఉద్యోగికి నష్టం కలుగుతుందన్నారు. అన్ని అంశాలపై డీడీఓలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఖజానాధికారి చిన్న సాయిలు , డీడీఓలు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భూపాల్



నియామక పత్రం అందుకుంటున్న ముత్యాల భూపాల్

మిరుదొడ్డి(దుబ్బాక): ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల భూపాల్ (కాసులాబాద్) నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ బిల్లు పెడతామని హామీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. వర్గీకరణ విషయంలో రెండు నాలుకల ధోరణి అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తనపై నమ్మకంతో ఉపాధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు పాపన్న, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వెంకట్

తొగుట(దుబ్బాక): మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన బొంబాయి వెంకట్‌ను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించారు. సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ఆదేశాలు జారీ చేశారు. వెంకట్ మాట్లాడుతూ ఎబీసీడీ వర్గీకరణ కోసం తన వంతు పోరాటం చేస్తామన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



ట్రోఫీలు అందుకుంటున్న క్రీడాకారులు

నారాయణఖేడ్: కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం మిషన్ కలాలి గ్రామంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ఉమ్మడి రాష్ట్రాల ఓపెన్ టు ఆల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఖేడ్ క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. మహారాష్ట్రలోని డెగ్లూరు టీంతో హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో ఖేడ్ డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకారులు రవిగౌడ్, ఖలీల్ ప్రథమ బహుమతిని సాధించారు. అసోసియేషన్‌కు చెందిన రెండవ జట్టులోని రిత్వేజ్, గంభీర్ సెమీఫైనల్‌లో ఓడినా రిత్వేజ్ ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డును దక్కించుకున్నారు. వీరిని అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ సాజిద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్‌తోపాటు భూమయ్య, ప్రవీణ్, మారుతి, దేవీసింగ్ అభినందించారు.

అంత్యక్రియలకు వచ్చి..


చెరువులో పడి వ్యక్తి మృతి



కిషన్(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): అంత్యక్రియల కోసం వచ్చిన ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మెదక్ మండలం శివ్వాయిపల్లి గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన చాకలి బల్కొల్ల మల్లమ్మ (48) అంత్యక్రియలు ముగిశాయి. అనంతరం అదే గ్రామానికి చెందిన చాకలి కిషన్ (56)తోపాటు కుటుంబీకులు కలిసి ముత్తాయి చెరువులో స్నానం చేస్తుండగా కిషన్ నీట మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య యాదమ్మ ఉన్నారు.







చిన్నకోడూరు(సిద్దిపేట): పొలం గట్టుపై అన్నం తింటున్న కూలీలు

సాగు జోరు.. నాట్లు షురూ

యాసంగి సాగుకు రైతాంగం సిద్ధమైంది. మహిళలు వరి నాట్లు వేస్తూ.. రైతులు ట్రాక్టర్లతో పొలాలు దుక్కి దున్నుతూ బిజీబిజీగా మారారు. అలాగే రైతులు వినూత్న ఆలోచనలతో పక్షుల బారి నుంచి వరి నారును కాపాడుకునేందుకు చీరలను రక్షణ వలయాలుగా ఏర్పాటు చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా పరిధిలోని తొగుట మండల పరిధిలోని పలు బండారుపల్లి, ఎల్లారెడ్డిపేట, పెద్దమాసాన్‌పల్లి గ్రామాల్లో వ్యవసాయ పనులను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట





రెవెన్యూ డివిజన్ చేయాలి

జేఏసీ చైర్మన్ చక్రధర్



సమావేశంలో మాట్లాడుతున్న చక్రధర్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూళ్మిట్ట మండలాలను కలుపుతూ చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ చక్రధర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కేంద్రంలోని షాదీఖానాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నెల రోజుల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు మర్చిపోతే బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతి కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఈ ప్రాంత ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అందె బీరయ్య, బూర్గు సురేశ్, తోకల ఉమారాణి, నరేశ్, రమేశ్, నాగరాజు, విజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల పరిశీలన



నిర్మాణాలను పరిశీలించి రికార్డులను చూస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని మాదారం గ్రామంలో ఖారీజ్ ఖాతా భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతుండడంతో 'ఖారీజ్ ఖాతా భూముల్లో అక్రమ నిర్మాణాలు' పేరిట 'సాక్షి'లో ఓ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి జిన్నారం రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ, సర్వేయర్ రామభద్ర సోమవారం మాదారంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ మాట్లాడుతూ మాదారంలోని 264, 265, 267 సర్వేనంబర్లు ఖారీజ్‌ఖాతా భూములే అన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలిస్తున్నామన్నారు. అనంతరం తదుపరి చర్యలు చేపడుతామన్నారు.

జాతీయ యువజన దినోత్సవాలు

- 11, 12వ తేదీల్లో నిర్వహణ
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్



సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్, నెహ్రూ యువ కేంద్ర అధికారులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించే జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్ తెలిపారు. జిల్లా నెహ్రూ యువ కేంద్ర, డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరగబోయే జాతీయ యువజన ఉత్సవాల నిర్వహణపై సోమవారం సమావేశం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి రంజిత్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. 11న ''మై భారత్ వికసిత్ భారత్–2047'' వక్తృత్వ పోటీలు, 12న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నెహ్రూ యువ కేంద్ర కోర్డినేటర్ కిరణ్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రద్ధానందం, డాక్టర్ మహేందర్, కృష్ణయ్య, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ మహేందర్ రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల దొంగల హల్‌చల్

వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం దొంగలు హల్‌చల్ చేశారు. కొమురవెల్లిలో మల్లన్న కల్యాణానికి వచ్చిన భక్తురాలి మెడలో నుంచి 10 తులాల బంగారం, రామాయంపేటలోని ఓ ఆలయంలో నగదు ఉన్న హుండీలను ఎత్తుకెళ్లారు. అలాగే బెజ్జంకిలోని ఓ గ్రామంలో పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ చేశారు.



రామాయంపేట(మెదక్): ఊరి బయట దొంగలు పడేసిన హుండీలను పరిశీలిస్తున్న పోలీసులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయ ప్రాంగణంలోని గంగిరేణి చెట్టు వద్ద ఓ మహిళ మెడలో నుంచి 10 తులాల బంగారు ఆభరణాలు దొంగలు చోరీ చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన సన్న అండాలు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి మల్లన్న కల్యాణానికి వచ్చింది. స్వామి వారి కల్యాణం అనంతరం మొక్కులు చెల్లించే క్రమంలో గంగిరేణి చెట్టు ప్రదక్షిణ చేస్తుండగా గుర్తు తెలియని దొంగలు మెడలో నుంచి ఆరు తులాల పుస్తెల తాడు, నాలుగు తులాల నెక్లెస్ చోరీ చేశారు. బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో చోరీ

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని మల్లికార్జునస్వామి గుడిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు గుడి తాళాలు, సీసీ కెమెరాలను పగులగొట్టి రెండు హుండీలను ఎత్తుకెళ్లారు. హుండీల్లో సుమారుగా రూ. 50 వేల నగదు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఏడాది కాలంలో రెండు, మూడు సార్లు ఆలయంలో చోరీ జరిగిందని, ఈ విషయమై పోలీసులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

రూ. 27 వేల నగదు అపహరణ

బెజ్జంకి(సిద్దిపేట): పట్టపగలే ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండలంలోని గాగిల్లాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొరుకునూరి కనకయ్య భార్యతో కలిసి వ్యవసాయ పనికి వెళ్లాడు. పని అనంతరం ఇంటికొచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.27 వేలు దొంగలు ఎత్తుకెళ్లారు. ఇంటి ముందు భాగంలో ఉన్న కిటికీలో తాళంచెవి పెట్టి రోజూ పనికి వెళ్లారు. ఇది గమనించిన వారే చోరీకి పాల్పడి ఉంటారని బాధితులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిందు చిన్నబోయింది

- వీధి నాటకాలకు ఆదరణ కరువు
- అంతరించిపోతున్న కళారూపం
- ఒకప్పుడు వారి ప్రదర్శనలే ప్రజలకు కాలక్షేపం
- నేడు దీనస్థితిలో దాసరులు



నాటక ప్రదర్శనలో దాసరులు (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): దాసరి బాగోతం నాటి తరానికి ఆహ్లాదంతోపాటు చారిత్రక ఘట్టాలను కళ్ల ముందుంచింది. పురాణగాథలను సాక్షాత్కరిస్తూ ఎన్నో కుటుంబాలు ఉపాధి పొందాయి. గతంలో కాలక్షేపానికి నాటకాలే ఏకైక సాధనంగా పని చేశాయి. దాసరులకు ప్రతీ ఊరిలో ప్రత్యేక ఆహ్వానాలు, బహుమానాలతో పాటు కడుపునిండా తిండి దొరికేది. కాలం మారుతున్న కొద్దీ ఇతర మాధ్యమాల రాకతో దాసరి వృత్తి కనుమరుగైపోయింది. టీవీలు, సినిమాలు వచ్చిన తర్వాత నాటకాలకు ఆదరణ పూర్తిగా తగ్గిపోయింది. అదే వృత్తిని నమ్ముకున్న దాసరి కుటుంబాలు ప్రస్తుతం దీన స్థితిని ఎదుర్కొంటున్నాయి.

చిన్నకోడూరు మండలం రామంచ మదిర గ్రామం దాసరివాడలో సుమారు 150 కుటుంబాలు ఉంటాయి. వీరంత దాసరి కులానికి చెందిన వారే. వీరు గతంలో దాసరి బాగోతాలు, వీధి నాటకాలు వేస్తూ జీవనం సాగించేవారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వివిధ రకాల సామగ్రిని ఊరూరా తిరుగుతూ విక్రయిస్తూ జీవనం గడుపుతున్నారు. సమాజానికి దూరంగా ఉంచబడిన సంచార జాతుల్లో దాసరి ఒకటి. నుదుటిపై నామాల బొట్టు పెట్టుకొని భిక్షాటన చేసుకుంటూ సంచార జీవనం గడిపేవారు.

మగవారే స్త్రీ, పురుషుల పాత్రలు

దాసరి కులస్తులు వైష్ణవ భక్తులు. తమ గాత్రంతో అనునిత్యం శ్రీమహావిష్ణువుని ధ్యానిస్తూ హరినామస్మరణ చేస్తూ సాగే వారు. తమ కళను బాగోతంగా మార్చుకొని తమ సాహిత్య పిపాసని, కళాతృష్ణ తీర్చుకోవడానికి కళా బృందంగా ఏర్పడి బాగోతాలను ప్రదర్శించేవారు. వీధుల్లో బాగోతం ఆడడంతో వీధి బాగోతం అనే పేరు వచ్చింది. ఆట విడుపుకి, కాలక్షేపానికి ఒకప్పుడూ ఈ బాగోతం విరాజిల్లింది. రాత్రిళ్లు మాత్రమే కళా ప్రదర్శనలు చేయడం దాసరి బాగోతం ప్రత్యేకత. మగవారు మాత్రమే స్త్రీ, పురుషుల పాత్రలు చేసేవారు. మహిళలు సవరాలు అల్లుతూ.. బొట్టు బిల్లలు, ప్లాస్టిక్ డబ్బాలు అమ్ముతూ కుటుంబానికి చేదోడుగా ఉండేవారు. ఇప్పటికీ అదే వృత్తిపై జీవనం సాగిస్తున్న కుటుంబాలు ఉన్నాయి.



వీధి నాటకంలో దాసరులు(ఫైల్)

పరవశించిన ప్రజలు..

దాసరిలు ఒకప్పుడు పౌరాణిక పాత్రలతో ప్రజల్లో మన సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టారు. అప్పట్లో కాలక్షేపానికి వేరే మార్గాలు లేకపోవడంతో బాగోతంపై ఆసక్తి చూపేవారు. గ్రామాల్లో బాగోతం ప్రదర్శన ఉందంటే ఊరంతా తరలివచ్చి తెల్లవారే వరకు తిలకించేవారు. నాటకంలో వారి ప్రదర్శనను మెచ్చిన జనం డబ్బులతోపాటు వడ్లు, బియ్యం ఇతర సామగ్రిని అందజేసేవారు. ఈ నాటకాలు చేస్తున్నారంటే ప్రదర్శన నిర్వహించే ప్రాంతంలో తమదిగా చెప్పుకునేందుకు వస్తువులు పెట్టి వచ్చేవారు. నాడు దాసరులు అంతటి ఆదరణ పొందారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



వృత్తినే నమ్ముకొని జీవనం సాగించాం. ప్రస్తుతం కళలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. వీటిని కాపాడుకునేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నాం. ప్రభుత్వం పురాతన కళలను కాపాడే దిశగా చర్యలు చేపట్టాలి. దాసరి బాగోతాన్ని కాపాడాలంటే ప్రభుత్వం దాసరులను అన్ని విధాలుగా ఆదుకోవాలి.

–పెంద్యాల కిషయ్య, దాసరి కళాకారుడు

డ్రంకెన్ డ్రైవ్‌లో తొమ్మిది మందికి జరిమానా

ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ తొమ్మిది మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు సోమవారం జరిమానా విధించినట్లు పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. శనివారం, ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనం నడుపుతున్న తొమ్మిది మందిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికీ రూ. 10 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ తెలిపారు.

ఆడుకుంటూ వెళ్లి.. అదృశ్యమయ్యారు

తప్పిపోయిన ఇద్దరు బాలురు





యశ్వంత్, దేవీశ్రీప్రసాద్

జిన్నారం(పటాన్‌చెరు): ఆడుకుంటూ ఉన్న ఇద్దరు బాలురు అదృశ్యమైన ఘటన జిన్నారం మండలంలోని బొల్లారం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నయీముద్దీన్ కథనం ప్రకారం.. బొల్లారం పారిశ్రామిక వాడలోని సంతోష్‌నగర్ కాలనీలో శ్రీనివాస్, ప్రమీల రాణి నివాసం ఉంటున్నారు. వీరికి యశ్వంత్ (12), దేవీశ్రీప్రసాద్(8) ఇద్దరు కుమారులు ఉన్నారు. గత నెల 29న ఇంటి బయట ఆడుకుంటూ అన్నా, తమ్ముళ్లు తప్పిపోయారు. అప్పటి నుంచి ఇంత వరకు తిరిగి రాలేదు. గతంలో కూడా ఒకసారి అన్నా, తమ్ముళ్లు తప్పిపోయి, వారే తిరిగి ఇంటికి వచ్చారు. ఇప్పుడు కూడా వస్తారని తల్లిదండ్రులు ఎదురుచూశారు. కానీ, రాకపోవడంతో తల్లి ప్రమీల రాణి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని, ఇద్దరి ఆచూకీ కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని సీఐ నయీముద్దీన్ తెలిపారు.

పని ముగించుకొని ఇంటికొస్తుండగా..

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



వెంకటేశ్ (ఫైల్)

నారాయణఖేడ్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. నారాయణఖేడ్–2 ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తుర్కాపల్లికి చెందిన దిడ్డి వెంకటేశ్ (30) ఖేడ్ పట్టణంలోని వెంకటేశ్వర షాపింగ్‌మాల్‌లో పని చేస్తున్నాడు. ప్రతిరోజూ లాగే ఆదివారం విధులు ముగించుకొని బైక్‌పై తుర్కపల్లికి వెళ్తుండగా చాంద్‌ఖాన్‌పల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించి మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారని, అతడి ఉద్యోగంపైనే కుటుంబం ఆధారపడి ఉందని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ఖేడ్ పట్టణంలో అనుమానాస్పదస్థితిలో ఓ వివాహిత మృతి చెందింది. ఖేడ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ పట్టణ ఏఐఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ యూసుఫ్, రెండో భార్య ఆశియా అంజుమ్ (35) పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. వీరికి కుమార్తె ఉండగా, సోమవారం సాయంత్రం పాఠశాల నుంచి తీసుకొచ్చేందుకు సయ్యద్ యూసుఫ్ భార్యకు ఫోన్ చేశాడు. ఎంతకీ ఫోన్ ఎత్తకపోవడంతో బయటికి వెళ్లిన అతడు ఇంటికొచ్చాడు. వంట గదిలో భార్య అచేతనంగా పడి ఉండగా హుటాహుటినా ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఆస్పత్రిని సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో బాత్ రూమ్‌లో పడి..

తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో బాత్ రూమ్‌లో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని కేఎస్ఆర్ కాలనీకి చెందిన పల్లపు దేవేందర్(32) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం మద్యం సేవించి ఇంటికి వచ్చాక బాత్ రూమ్‌లోకి వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయాడు. వెంటనే భార్య ధనలక్ష్మి చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఛాతీ నొప్పితో ఆస్పత్రికి వెళ్లిన లారీ డ్రైవర్ మృతి

ఛాతీ నొప్పి రావడంతో ఆస్పత్రికి వెళ్లిన లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాస్(50) కో డ్రైవర్ రాజాతో కలిసి ఈనెల 6వ తేదీన తమిళనాడు నుంచి గ్లూకోస్ లోడు తీసుకొని హైదరాబాద్ సనత్ నగర్‌కి 8వ తేదీ ఉదయం వచ్చి అన్‌లోడ్ చేశారు. తిరిగి వెళ్తూ పటాన్‌చెరు పాత టోల్ గేట్ సమీపంలో భోజనం చేశారు. అనంతరం డ్రైవర్ శ్రీనివాస్‌కు ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో రాజా పటాన్‌చెరు సమీపంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.